31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం 17 జూలై 2026 | పేజీలు : 8

## మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసులో ఇద్దరి అరెస్టు




**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 16 :** జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల పట్టణ సీఐ పి. కరుణాకర్ తెలిపారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ లో జూలై 8న మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. జగిత్యాల పట్టణంలోని తులసి నగర్‌కు చెందిన సమీండ్ల రాజేష్, సమీండ్ల గంగరాజు వారి తాత పేరుపై ఉన్న ఆస్తికి పార్టిషన్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు డాక్యుమెంట్ రైటర్ దిండిగల శ్రీనివాస్ సహకారంతో మున్సిపల్ అసెస్‌మెంట్ సర్టిఫికేట్‌పై కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ ఎన్. సదాకర్ దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితులు సమీండ్ల రాజేష్, దిండిగల శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సమీండ్ల గంగరాజు పరారీలో ఉన్నాడు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ప్రభుత్వ పత్రాలు, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కరుణాకర్ హెచ్చరించారు.

## "బల్మూరి"కి కేబినెట్ హోదా





(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కు కేబినెట్ హోదా లభించింది. వెంకట్ తో పాటు మరో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు కూడా కేబినెట్ హోదా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రోటోకాల్ లో, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ వెంకట్ కు ప్రాధాన్యత లభించనుంది.

**ఎన్ఎస్‌యుఐ నేతగా..**

విద్యార్థి దశ నుండే రాజకీయాల్లో ఉన్న బల్మూరి వెంకట్ రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు అప్పటి ప్రభుత్వంపై పోరాటాలు చేశారు. విద్యార్థుల, విద్యారంగ సమస్యలపై గళమెత్తారు. నాటి పిసిసి అధ్యక్షునిగా ఉన్న నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా తిరిగారు. ఆయనపై గత ప్రభుత్వంలో ఎన్నో కేసులు నమోదయ్యాయి. పలుసార్లు అరెస్టై జైలుకు కూడా వెళ్లారు. కాంగ్రెస్ పార్టీలో బలమైన వాయిస్ వినిపించే నేతగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రొటెక్టర్ గా బల్మూరి పనిచేస్తున్నారు. 2021లో హుజురాబాద్ లో ఈటల రాజీనామాతో వచ్చిన ఉప ఎన్నికలు కాంగ్రెస్ అభ్యర్థిగా బల్మూరి పోటీ చేసి ఓటమి చెందారు. అయినప్పటికీ ఇప్పటికీ ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో టచ్ లో ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వెంటనే సీఎం రేవంత్ రెడ్డి..

2లో

## ప్రతి విద్యార్థి లక్ష్యం చేరుకోవాలి






**-ఆటలు ఆడాలి.. చదవాలి**
**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి కేజీబీవీ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్**
**-ఆహార పదార్థాలు, కూరగాయలు, విద్యాలయం ఆవరణ పరిశీలన**

**చురకలు ప్రతినిధి, సిరిసిల్ల జూలై 16 :** ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని.. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో యూనిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని స్టోర్ రూమ్ లో బియ్యం, కూరగాయలు, పండ్లు, నెయ్యి, ఇతర పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. విద్యాలయంలో చదివి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు ప్రస్తుతం ఎక్కడ చదువుతున్నారో ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని.. దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రవేశానికి చాలా మంది పోటీ పడతారని, ఇక్కడ చదివే మంచి అవకాశం విద్యార్థులకు వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థులు రోజు ఆటలు ఆడాలని.. మంచిగా చదవాలని సూచించారు. చదువు మధ్యలో మానేయవద్దని, ఉన్నత విద్యాబ్యాసం చేయాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అప్పుడే మహిళ సాధికారత సాధ్యమని తెలిపారు. విద్యార్థులకు మహిళా సంఘాల వారితో

- 2లో

### నరసింహ స్వామిని దర్శించుకున్న

## కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు

### నల్లగొండలో కేంద్ర మంత్రి సంజయ్ పూజలు



**జగిత్యాల ప్రతినిధి, జూలై 16 :** ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం భక్తి పారవశ్యంతో మార్మోగింది. తమ కుటుం బ ఇలవేల్పు అయిన నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయా నికి చేరుకున్న మంత్రి దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్ర త్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. వేదపండితులు మంత్రోచ్ఛరణ లతో, గోత్రణామాధులతో పూజలు చేసి మంత్రి దంపతులకు ఆశీర్వచనం అం దించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, రక్షణను అందజేశారు. ఆలయ పక్షాన కేంద్ర మంత్రి దంపతులకు శాలువా కప్పి, స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

**ప్రజలు సుభిక్షంగా ఉండాలి : బండి సంజయ్**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, తమ కుటుంబానికి నల్లగొండ

2లో

### సిరిసిల్ల రెస్టారెంట్‌లో బిర్యానీ తిని

## పలువురికి అస్వస్థత





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 16 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫుడ్ పాయిజన్ ఘటన మరోసారి కలకలం రేపింది. ఇల్లంతకుంట మండలం రామోజీపేట, సిరిసిల్ల అర్బన్ పెద్ద బోనాల, కోనరావుపేట మండలం కొండాపూర్ కు చెందిన పది మంది యువకులు జిల్లా కేంద్రంలోని ఓ మండి బిర్యాని సెంటర్లో బిర్యాని తిని గురువారం అస్వస్థత గురయ్యారు. వాంతులు విరోచనాలు జ్వరంతో కొంతమంది జిల్లా ప్రధాన ఆస్పత్రి, మరి కొంతమంది ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆహార జరగడం వలన బాధితులకు ఫుడ్ పాయిజన్ అయిందని వైద్యులు ప్రాథమిక నిర్ధారణ చేశారు. బకాసుర మండి బిర్యాని సెంటర్లో బిర్యాని తినడం వల్లనే తమకు ఇలా జరిగిందని బాధితులు వాపోతున్నారు. కాగా జిల్లాలో ఇలా వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతు న్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

2లో

## ప్రతి విద్యార్థి లక్ష్యం చేరుకోవాలి



**మొదటి పేజీ తరువాయి....**యూనిఫాంలు కుట్టిస్తున్నామని, వారికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ కోసం ఒక మండల, జిల్లా స్థాయి అధికారులను కేటాయించామని వివరించారు. వారు విద్యాలయం తనిఖీ చేసి.. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.కార్యక్రమంలో డీఈఓ మొండయ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ అబూబాకర్, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## నరసింహ స్వామిని దర్శించుకున్న...



**మొదటి పేజీ తరువాయి...**లక్ష్మీ నరసింహ స్వామి ఇలవేల్పని, ప్రతి ఏడాది కుటుంబంతో కలిసి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.దేశ,రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు కేంద్ర మంత్రి సంజయ్ పేర్కొన్నారు.ప్రజలు బాగుంటేనే దేశం బాగుంటుందని అన్నారు. కేంద్ర మంత్రి సంజయ్ దర్శనంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న నల్లగొండ నరసింహ స్వామి ఆలయనికి ప్రముఖుల రాకతో ఆలయానికి మరింత ప్రాధాన్యం పెరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు.

## సిరిసిల్ల రెస్టారెంట్‌లో బిర్యానీ తిని పలువురికి అస్వస్థత

**మొదటి పేజీ తరువాయి.....** ఎక్కడ అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటల్లు రెస్టారెంట్లు బిర్యాని సెంటర్లను తనిఖీలు చేసి ఆహార కల్తీలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఎక్కడ అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటల్లు రెస్టారెంట్లు బిర్యాని సెంటర్లను తనిఖీలు చేసి ఆహార కల్తీలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# లింగాపూర్ మోడల్ స్కూల్ బావిలో పడి విద్యార్థి సాత్విక్ మృతి

**- ప్రిన్సిపాల్, పిఈటిని వెంటనే సస్పెండ్ చేయాలి**

**-బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలి**

**-25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి**

**-ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**



చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 16 : రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్ లో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం జరగాలని ఏఐఎస్ఎఫ్,ఎన్ఎస్.యు.ఐ , విద్యార్థి , ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం,ఎన్ఎస్.యూ.ఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల దుర్గ ప్రసాద్ లు మాట్లాడుతూ ప్రిన్సిపాల్, పిఈటిని వెంటనే సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రత్యేకమైన డిమాండ్లను పరిష్కరించాలని మూడు గంటల పాటు నిరసన చేయడం జరిగిందని, ఏఐఎస్ఎఫ్, ఎంఎన్ఎస్.యూ.ఐ, విద్యార్థి ప్రజా సంఘాల , బాధిత కుటుంబ పోరాటానికి పెద్దపెల్లి జిల్లా ఆర్డీవో గట్టయ్య, సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని మీడియా ముందు హామీ ఇవ్వడం జరి గిందని వారన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో ముఖ్య పాత్ర పోషించినటువంటి రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గొడిసెల ప్రణీత్ , పప్పు శ్రీకాంత్, దుర్గ అవినాష్, పవన్, నందకిషోర్ పాల్గొన్నారు.

# “బల్మూరి”కి కేబినెట్ హోదా

**మొదటి పేజీ తరువాయి...**
వెంకట్ కు ఎమ్మెల్సీ వచ్చేందుకు కృషి చేశారు. అయితే అప్పుడప్పుడు నియోజకవర్గంలో వెంకట్ పర్యటిస్తున్నారు. నేరుగా రాష్ట్ర కేబినెట్లో బల్మూరిని తీసుకునే అవకాశం తక్కువగా ఉండడం తో పరోక్షంగా ఆయనకు కేబినెట్ హోదాను ప్రస్తుతం కల్పించారు.

**ప్రణవ్ కు అవకాశం దక్కేనా?**

హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా మాజీ ఎంపీ దివంగత సింగాపురం రాజేశ్వరరావు మనుమడు వొడితల ప్రణవ్ ఉన్నారు. ప్రణవ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుండి పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ పార్టీ శ్రేణులకు అండగా ఉన్నారు. ప్రభుత్వ, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళుతున్నారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లోను, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకునేందుకు ఆయన కృషి చేశారు. అయితే ఆయనకు ప్రోటోకాల్ లభించే నామినేటెడ్ పదవి లేకపోవడం మైనస్ గా మారుతోంది.

నామినేటెడ్ పదవి ఉంటే కార్యకర్తల తరఫున అధికారులతో గట్టిగా మాట్లాడే వీలు కలుగుతుంది. ప్రణవ్ కు నామినేటెడ్ పదవి ఇస్తారా? లేదా? అన్నది స్పష్టత రావడం లేదు. ఇక్కడ బలంగా ఉన్న బి జె పి నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలను ఎదుర్కోవాలంటే ప్రణవ్ కు కెబినేట్ హోదాతో నామినేటెడ్ పదవి లేదా ఎమ్మెల్సీ ఇవ్వాలని తద్వారా కాంగ్రెస్ రాబోయే కాలంలో నియోజకవర్గంలో బలోపేతం అవుతుందని ఆయన అభిమానులు కోరుతున్నారు.

**వెంకట్ కు కేబినెట్ హోదాపై “గుడిపాటి” హర్షం**

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కు కేబినెట్ హోదా ఇవ్వడంపై స్థానిక కాంగ్రెస్ నేత గుడిపాటి జయపాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎన్ఎస్యుఐ నేతగా ఎన్నో పోలీసు కేసులను, నాటి ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని పనిచేశారని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో, నిరుద్యోగులను యువత మద్దతు సమీకరించడంలో కీలకపాత్ర పోషించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అన్నివేళలా మద్దతుగా నిలిచారని ప్రశంసించారు. రాబోయే కాలంలో ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు వెంకట్ కృషి చేస్తున్నారని, ఆయనకు ఈ ప్రాంతంపై ప్రత్యేకమైన ప్రేమ ఉందని జయపాల్ రెడ్డి గుర్తు చేశారు. హుజురాబాద్ ప్రాంత సమస్యలు పరిష్కరించేందుకు ఆయన ఎప్పుడూ ముందు ఉంటారని అన్నారు.

# తెలంగాణలో పడిపోతున్న ఉపాధి, ఉద్యోగాల సంఖ్య

**కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసిన ఈపీఎఫ్ఓ నివేదికతో వెలుగులోకి తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని సూచిస్తోందన్న దాసోజు శ్రవణ్**



చురకలు, కరీంనగర్ : కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసిన అధికారిక ఈపీఎఫ్ఓ నివేదికతో తెలంగాణ రాష్ట్రములో ఉద్యోగాల కల్పన, ప్రైవేట్ రంగ వృద్ధి ఘోరంగా పడిపోయిందన్న సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ నేత ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. 2023-24తో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో నికర ఈపీఎఫ్ ఖాతాల సంఖ్య కేవలం 6,749 మాత్రమే పెరిగి, 7.66 లక్షల నుండి 7.72 లక్షలకు చేరిందన్నారు. ప్రైవేట్ ఉద్యోగాల వృద్ధి రేటు 0.88 శాతానికి పడిపోగా, దేశ సగటు వృద్ధి రేటు 2.64 శాతంతో పోలిస్తే తెలంగాణ మూడు రెట్లు వెనుకబడిందన్నారు. ఇది తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని సూచిస్తోందని ఆయన వెల్లడించారు. గ్లోబల్ ఐటీ, ఫార్మా హబ్‌గా వెలిగిన హైదరాబాద్‌ను రేవంత్ ప్రభుత్వం రివర్స్ గేర్ వేయించి,పెట్టుబడులు స్తంభించి పోయి ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ఇక ప్రైవేట్ రంగ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం 50 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామంటూ చేస్తున్న ప్రచారంలో అసత్యాలు ఉన్నట్లు అసెంబ్లీ వేదికగా డిప్యూటీ సీఎం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానమే నిదర్శనమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసినవి కేవలం 16,978 పోస్టులు మాత్రమే కాగా, మిగిలిన 50,785 ఉద్యోగాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేశారాని లెక్కలు చెప్పారు. గత ప్రభుత్వం వండి వార్చిన అన్నాన్ని కొత్త పాత్రలో వడ్డించి, నియామక పత్రాల సభల ద్వారా రేవంత్ సర్కార్ అందజేసి వంద శాతం క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ వంటి ఎన్నికల హామీలన్నీ హుష్ కాకి అయ్యాయని, ఇచ్చిన హామీలు, వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్న యువతపై లాఠీఛార్జీలు, అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తూ..ఈ ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు.

# మహిళలే సమాజానికి దిక్సూచి

**-వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం మహిళలు ముందుండాలి**
**-ప్రజాధర్బార్ పుస్తకావిష్కరణలో రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపు**



**జగిత్యాల ప్రతినిధి, జూలై 16 :** రాష్ట్ర, దేశ అభివృద్ధి మహిళల చేతుల్లోనే ఉందని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య అన్నారు.హైదరాబాద్ విద్యానగర్‌లోని కృష్ణయ్య కార్యాలయం లో జగిత్యాలకు చెందిన సామాజిక సేవకురాలు,రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ దాసరి రజిని తదితరులు కలిసి గురువారం కృష్ణయ్య రచించిన "ప్రజాధర్బార్" పుస్తకా విష్కరణలో పాల్గొని ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ "మహిళలు ఈ సమాజానికి దిక్సూచిలా ఉండాలన్నారు.మహిళలు ముందుండి సమాజాన్ని చైతన్యపరుస్తూ, నిరంతరం పోరాటం చేస్తేనే రాష్ట్రం,దేశం అత్యంత వేగవంతంగా అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆయన పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం మహిళలు ముందుండి పోరాడాలని కృష్ణయ్య అభిప్రాయపడ్డారు."మహిళా శక్తి లేనిదే సమాజ ప్రగతి సాధ్యం కాదనీ, బీసీ సంక్షేమం, సామాజిక న్యాయం కోసం మహిళలు నాయకత్వం వహిస్తే దేశం వేగంగా ముందుకు వెళ తుందని కృష్ణయ్య ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రచయిత, దర్శకుడు అశోక్ కుమార్, సంఘ సేవకురాలు వెంకట్ శోభ,గాయకులు వినయ్, నటుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# త్రీఫేస్ కరెంట్ ఎప్పుడు ఇస్తారు..?

**- ఒక్కో రోజు ఒక్కోల రాత్రి 2,రాత్రి 4,ఉదయం 7 కరెంటు**
**- వర్షకొండ సబ్ స్టేషన్ ముట్టడించిన రైతులు**
**- అప్రకటిత త్రీఫేస్ కరెంటు తో రైతుల ఆందోళన**
**- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సమయంలో మార్పులు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (16) :** అసలే వర్షాలు లేక తీవ్ర ఆదోళన చెందుతుంటే రైతులు వేసిన పంటల కు నిరు అందించేందుకు 3 ఫెస్ కరెంటు తో పెడుదమంటే కరెంటు ఎప్పుఇస్తారొ ఎప్పుడు తిస్తారో తెలియని పరిస్థితి ఉందని రైతులు విధ్యుత్ ఉపకేంద్రం ముట్టించిన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వర్షకొండ గ్రామం లోని 33/11 సబ్‌స్టేషన్ లో చోటుచేసుకుంది. గురువారం రైతులు త్రీఫేస్ ఒక్కో రోజు ఒక్కల రాత్రి 2,రాత్రి 4,ఉదయం 7 గంటలకు ఇస్తె ఎలా నిటి పారకం చేసుకోవలనీ, వ్యవసాయ క్షేత్రంలో పడుకోవల్సి వస్తుందని,తోటలలో పాములతో ఇబ్బంది అవుతోదనీ సమయపాలన ఉంటే ఇబ్బంది ఉండదనీ రైతులు అదికమొత్తం పాల్గొని నిరసన చెప్పట్టారు.ఆపరేటర్ నవిన్‌ను రైతులు నిలదిశారు. సమయపాలన లేని కరెంటుతో ఎలా పారకాలు చేసుకోవాలని ఉన్నతాధి కారులు వచ్చేంతవరకు నిరసన చేపడుతామని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న మేడిపల్లి వైస్త ఎఈ ప్రశాంత్ రైతుల తో ఫోన్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం త్రీఫేస్ కరెంట్ వస్తుందని మా పరిధిలో ఏమీ లేదన్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు.1912కు పిర్యాదు చేసిన పట్టించుకునే వారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో దోమకొండ చిన్నరాజన్న,దోస భుమేశ్వర్,దోమకొండ నద్దీ రాజన్న,అరపల్లి ఆశన్న,బాయి రాజన్న,బైన శాంతయ్య,గుర్రు గంగాధర్,బాయి రాకేష్,అరె రాజేంధర్, అరపల్లి చిన్న భుమన్న తదితరులు పాల్గొన్నారు.

# యూఏఈలో 500 ఉద్యోగాలు

**- అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**
**- జూలై 21న హైదరాబాద్‌లో ఆఫ్‌లైన్ ఇంటర్వ్యూలు**



**చురకలు విలేకరి జగిత్యాల జులై (16) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని దుబాయ్‌లో ప్రముఖ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ నియామకాల్లో భాగంగా క్లీనర్స్, టైల్ మేసన్స్, ఆల్‌రౌండ్ మేసన్స్, బ్లాక్/ప్లాస్టర్ మేసన్స్, స్టీల్ ఫిక్సర్స్, షట్టరింగ్ కార్పెంటర్స్, ప్లంబర్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రిషియన్స్, ఫినిషింగ్ కార్పెంటర్స్, ఎంఐజీ, వెల్డర్స్, జనరల్ హెల్పర్స్ తదితర విభాగాల్లో మొత్తం 500 ఖాళీలను భర్తీ చేయనున్నారు.అభ్యర్థుల నైపుణ్యానికి అనుగుణంగా జీతభత్యాలతో పాటు ఓవర్‌టైమ్ వేతనం చెల్లించనున్నట్లు వివరించారు. వసతి, రవాణా, వంటగది సౌకర్యాలను యజమాని కల్పిస్తారు. రోజుకు 9 గంటల పని ఉండగా, ఓవర్‌టైమ్ అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. జాయినింగ్ సమయంలో విమాన టికెట్ ఖర్చును అభ్యర్థులే భరించాల్సి ఉంటుందన్నారు. సంబంధిత ట్రేడ్లలో అనుభవం ఉన్న అభ్యర్థులు మాత్రమే అర్హులని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియ ఆఫ్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా నిర్వహించ బడుతుందని పేర్కొంటున్నారు. ఇంటర్వ్యూ వివరాలు: తేదీ: 21 జూలై 2026 స్థలం: టామ్‌కామ్ నూతన కార్యాలయం,టీజీఐఐసీ భవనం, మసాబ్ ట్యాంక్ సమీపంలో, హైదరాబాద్. ఆసక్తి గల అభ్యర్థులు నవీకరించిన రెజ్యూ, పాస్‌పోర్ట్, విద్యార్హత, అనుభవ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు: 8328602231, 9440050951, 9440051452.

## మాదకద్రవ్యాల నియంత్రణకు డాగ్ స్క్వాడ్ తనిఖీ



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 16 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో మాదకద్రవ్యాలనియంత్రణ లో భాగంగా గురువారం పోలీస్ డాగ్ స్క్వాడ్ తో కిరాణాలు,పాన్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు.మాదక ద్రావ్యాలకు అలవాటై యువత తమ బంగారు భవిష్యత్తును బుగ్గి పాలు చేసుకొంటుందని, దీన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టడంతో పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలుచేపడుతున్నారు.యువత గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని,మాధకద్రవ్యా లను వినియోగించినా,విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలుంటాయని వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ హెచ్చరించారు.గంజాయి విక్రయం, వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీస్ స్టేషన్ కు సమావారం ఇవ్వాలని, సమాచారంఇచ్చినవారిపేర్లు గోప్యం గా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

## ఘనంగా రాజాగౌడ్ జన్మదిన వేడుకలు



**చురకలు విలేఖరి,మెట్ పల్లి, జూలై,16 :** మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన సామాజిక కళాకారుడు అయినా యూఏఈ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా తోటి కార్మికులు అబుదబిలో నిర్వహించారు.ఈ సందర్భంగా రాజాగౌడ్ కేక్ కట్ చేశారు.అనంతరం కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు.బత్తిని రాజాగౌడ్ మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ దుబాయ్ వచ్చేముందు ప్రతి ఒక్క కార్మికుడు కొన్ని విషయాల పైన అవగాహన కలిగి ఉండాలి,అవి ఉద్యోగ భద్రత,గ్రాట్యూటీ సెలవులు,నోటీస్ ప్రొఫెషన్ పీరియడ్,పనిగంటలు,ఓవర్ టైం,వార్షిక సెలవులు,గ్రాడ్యుటీ నోటిఫికేషన్,ప్రొబెషన్ కాల చట్టం ప్రకారం గరిష్టంగా ఆరు నెల మాత్రమే అవకాశం ఉండును,అని పలు సూచనలు కార్మికులకు చేశారు,ఈ కార్యక్రమంలో బి నవీన్ ,వి నరసయ్య,కే అభి,వి లక్పతి,ఎన్ కిరణ్, పి శ్రీనివాస్,ఎస్ ప్రమోద్,డి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో వృద్ధుడి మృతి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జులై (16) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని యమాపూర్ గ్రామానికి చెందిన బాస బుచ్చన్న (65) వృద్ధుడు మనస్థాపంతో ఉరివేసుకుని మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ ఐ నవిన్ కుమార్ తెలిపారు. గురువారం ఎస్ ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు గత కొంతకాలంగా మద్యం తాగుడుకు బానిస అయినాడని,బుధవారం రోజున రాత్రి 11 గంటల సమయంలో మృతుడి భార్య అయిన బాస లక్ష్మి మద్యం తాగడం మానేయమని మందలించగా మనస్థాపం చెంది మృతుడు బుచ్చన్న ఇంటి బయట గల బాత్రూంలోని ఇనుపపట్టికి వీరతో ఉరికి వేసుకొని మరణించినట్లు కుమారుడు బాస రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

### జ్ఞాపకాల తీరాల్లో

# అపురూప రత్నం తుంగూరి శంకర్



తుంగూరి శంకర్ మృతి ధర్మపురి క్షేత్రానికి తీరని లోటు. ఒక వ్యక్తి మరణం కేవలం ఒక కుటుంబానికే కాకుండా, ఒక ఊరి సామాజిక, సాంస్కృతిక, క్రీడా, సాహిత్య జీవన ప్రవాహానికి కూడా శూన్యతను మిగిల్చిన సందర్భాలు చరిత్రలో చాలా అరుదుగా కనిపిస్తాయి. అలాంటి అరుదైన, మహోన్నత వ్యక్తిత్వ మే తుంగూరి శంకర్. ధర్మపురి ప్రజలతో ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పరుచుకొని, తన బహుముఖ ప్రజ్ఞతో అనేక రంగాల్లో చెరగని ముద్ర వేసిన ఆయన ఇక లేరనే వార్త ప్రతి ఒక్కరినీ విషాదంలో ముంచెత్తింది. సహృదయత, సేవాభావం, స్నేహశీలత, సాంస్కృతికాభిరుచి, క్రీడా స్ఫూర్తి, బాలల పట్ల ప్రేమ, సమాజాభివృద్ధి పట్ల అంకితభావం వంటి అనేక సుగుణాల సమ్మేళనంగా నిలిచిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుంది.ధర్మపురి క్షేత్రంలో ఏర్పాటైన తొలి బాలానంద సంఘం వ్యవస్థాపక సభ్యులలో తుంగూరి శంకర్ ఒకరు కావడం విశేషం. గత శతాబ్దపు మధ్యకాలంలో బాలల వ్యక్తిత్వ వికాసానికి, సృజనాత్మకతకు, సాంస్కృతిక చైతన్యానికి వేదికలు చాలా అరుదుగా ఉండేవి. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాలానంద సంఘం ద్వారా చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు, సాహిత్యాభిరుచి, కళాప్రతిభ, సామాజిక స్పృహ పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి ప్రశంసనీయం. ఆ సంఘం ద్వారా ఎంతో మంది విద్యార్థులు నైతిక విలువలను నేర్చుకుని, తదనంతర కాలంలో జీవితంలో అత్యున్నత స్థానాలకు చేరుకోవడానికి పరోక్షంగా ఆయన అందించిన నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతగానో దోహదపడ్డాయి.డెబ్బయ్యవ దశకంలో సమాజంలో వినోదానికి పరిమిత అవకాశాలే ఉన్న రోజుల్లో రేడియో ప్రజల జీవితంలో అత్యంత ప్రధాన మాధ్యమంగా ఉండేది. ముఖ్యంగా నాటి సిలోన్ రేడియో స్టేషన్ నుంచి ప్రతి బుధవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి తొమ్మిది గంటల వరకు ప్రసారమయ్యే "బినాకా గీత్‌మాలా" కార్యక్రమం దేశవ్యాప్తంగా అపార ఆదరణ పొందేది. ఆ హిందీ సినీగీతాల అద్భుత కార్యక్రమాన్ని ధర్మపురి ప్రజలకు పరిచయం చేసి, ప్రతి బుధవారం రాత్రి ఆ విజ్ఞాన, వినోద భరిత కార్యక్రమాన్ని ఆసక్తిగా వినే సామూహిక అలవాటు కల్పించిన వారిలో తుంగూరి శంకర్ ముందువరుసలో నిలిచారు. ఆయనకు సంగీతం పట్ల ఉన్న అభిరుచి కేవలం వ్యక్తిగత ఆసక్తిగానే మిగలకుండా, గ్రామ ప్రజలందరిలోనూ సంగీతాస్వాదనను, కళా చైతన్యాన్ని పెంపొందించే ఒక సాంస్కృతిక ఉద్యమంగా మారింది. కొత్త పాటలు, గాయకులు, సంగీత దర్శకుల శైలి గురించి ఆయన చెప్పే విశేషాలు ఆ కాలపు యువతలో ప్రత్యేక జిజ్ఞాసను కలిగించేవి.క్రీడా రంగంలోనూ తుంగూరి శంకర్ విశిష్ట స్థానాన్ని సంపాదించారు. ధర్మపురి పరిసర ప్రాంతాలలో క్రికెట్ ఆట మొదటి అడుగులు వేస్తున్న రోజుల్లో ఆయన అద్భుతమైన లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్‌గా, సమర్థుడైన వికెట్‌కీపర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో సరైన క్రీడా మైదానాలు, ఆధునిక క్రీడా సామగ్రి, శాస్త్రీయ శిక్షణ వంటి కనీస సౌకర్యాలు లేకపోయినా, ఆట పట్ల ఉన్న అంకితభావంతో యువతను సమీకరించి క్రికెట్‌ను గ్రామస్థాయిలో అమిత ప్రజాదరణ పొందేలా చేయడంలో ఆయన పాత్ర అనన్యసామాన్యం. ఆయనతో కలిసి ఆడిన సమకాలీనులు ఇప్పటికీ ఆయన చురుకుదనం, కఠిన క్రమశిక్షణ, జట్టు భావనను ఎంతో గౌరవంతో స్మరిస్తుంటారు. నేటి తరానికి ధర్మపురిలో క్రీడా సంస్కృతికి, ముఖ్యంగా క్రికెట్ రంగానికి బలమైన పునాదులు వేసిన వారిలో ఆయన పేరు చిరస్థాయి గా నిలుస్తుంది.బాల్యంలోనే నాటకరం గం పట్ల అమితమైన ఆసక్తి పెంచుకున్న తుంగూరి శంకర్ పాఠశాల దశ నుంచే అనేక పౌరాణిక, సాంఘిక నాటకాలలో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. పాత్రకు తగ్గట్టుగా హావభావాలు ప్రకటించడం, స్పష్టమైన సంభాషణ చాతుర్యం, ఉదాత్తమైన నటనా నైపుణ్యంతో ఆయన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే వారు. ఆ కాలంలో నాటకాలు కేవలం వినోదానికే కాక సామాజిక చైతన్యానికి ప్రధాన సాధనంగా ఉండేవి. అలాంటి నాటకరంగంలో ఆయన చేసిన సేవలు ధర్మపురి సాంస్కృతిక చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతాయి.తన నివాసాన్ని ఎల్లప్పుడూ మిత్రుల సమావేశాలకు, వినోద కార్యక్రమాలకు, సాహిత్య చర్చలకు, స్నేహసమ్మేళనాలకు వేదికగా మార్చిన ఉదార స్వభావుడిగా తుంగూరి శంకర్ అందరి హృదయాల్లో ముద్ర వేసుకున్నారు. ఆయన ఇంటికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ ఆత్మీయ ఆతిథ్యం లభించేది. అక్కడ నవ్వులు, సరదా సంభాషణలు, సంగీతం, సాహిత్యం, వర్తమాన రాజకీయాలు, సామాజిక అంశాలపై లోతైన విశ్లేషణాత్మక చర్చలు నిరంతరం సాగేవి. విభిన్న మనస్తత్వాలు గల వ్యక్తులను కలిపే ఒక స్నేహసేతువుగా ఆయన నిలిచారు. అందుకే ఆయనను కేవలం ఒక వ్యక్తిగా కాకుండా, ఒక సజీవ సాంస్కృతిక కేంద్రంగా, జ్ఞాన సదస్సుగా పలువురు ప్రముఖులు అభివర్ణిస్తుంటారు.విద్యార్థుల పట్ల, వారి భవిష్యత్తు పట్ల ఆయనకున్న ప్రేమ ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. బడిపిల్లల్లో దాగి ఉన్న సుప్తచేతనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఆయన నిరంతరం అనేక పోటీలు నిర్వహించేవారు. విజేతలుగా నిలిచిన వారికి స్వయంగా స్వంత ఖర్చులతో బహుమతులు అందించి వారిని ఎంతగానో ప్రోత్సహించేవారు. ముఖ్యంగా సమకాలీన రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, దేశ చరిత్ర, సాహిత్యం, సాధారణ విజ్ఞానం వంటి అంశాలపై విస్తృతమైన క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సాధారణ జ్ఞానాన్ని (జనరల్ నాలెడ్జ్) పెంపొందించేందుకు విశేషంగా కృషి చేశారు. పోటీలు కేవలం గెలుపోటముల కోసం కాకుండా, విజ్ఞానాన్ని పెంచుకునే నిరంతర సాధనమని ఆయన బలంగా నమ్మేవారు. ఆయన అందించిన ప్రగతిశీల ప్రోత్సాహంతో ఎంతోమంది విద్యార్థులు చదువులోనూ, ఉన్నత స్థాయి పోటీ పరీక్షల్లోనూ అద్భుతమైన ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలు అధిరోహించారు.వృత్తిపరంగా సహకార బ్యాంకు అధికారిగా సుదీర్ఘకాలం పనిచేసిన తుంగూరి శంకర్ రైతు సంక్షేమానికి విశేష సేవలు అందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన రైతుల అవసరాలను, కష్టాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని వారికి సకాలంలో రుణాలు అందేలా నిబంధనల పరిధిలో మానవీయతతో కృషి చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నిరంతరం అవగాహన కల్పిస్తూ రైతులకు నిజమైన మార్గదర్శకుడిగా నిలిచారు. ఉద్యోగాన్ని కేవలం జీవనోపాధిగా, ఒక విధిగా కాకుండా సమాజ సేవగా భావించి పనిచేయడం వల్ల సహచర ఉద్యోగులు, ఉన్నతాధికారులు, రైతాంగం మరియు సామాన్య ప్రజల అపారమైన అభిమానాన్ని సంపాదించారు. నిజాయితీ, పారదర్శకత, మానవీయ దృక్పథం ఆయన వృత్తి జీవితానికి నిలువెత్తు ప్రతీకలుగా నిలిచాయి.ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఆయన సమాజానికి దూరంగా ఏకాంత జీవితం గడపకుండా, నిరంతరం ప్రజలతో మమేకమై జీవించారు. యువతతో ముచ్చటించడం, చిన్నారుల సృజనాత్మకతను ప్రోత్సహించడం, పాత మిత్రులను కలుసుకోవడం, స్థానిక సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనడం ఆయన దినచర్యలో అంతర్భాగమయ్యాయి. వయస్సు పెరిగినా, శారీరక శ్రమ ఎదురైనా ఆయనలోని అంతర్గత ఉత్సాహం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. సమాజం పట్ల తనకున్న సామాజిక బాధ్యతను చివరి శ్వాస వరకు అత్యంత నిబద్ధతతో నిర్వర్తించారు.కొంతకాలంగా వృద్ధాప్య మరియు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ ఆయన తన సహజసిద్ధమైన ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. చివరకు కాలధర్మం చెంది ఈ భౌతిక లోకాన్ని విడిచి వెళ్లిపోయినా, ఆయన వదిలివెళ్లిన అమూల్యమైన జ్ఞాపకాలు, నిస్వార్థ సేవలు, ఆదర్శవంతమైన స్నేహబంధాలు, సాంస్కృతిక వారసత్వం ధర్మపురి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఒక వ్యక్తి జీవితం ఎంతకాలం కొనసాగిందన్నది ముఖ్యం కాదు, ఆ జీవితం సమాజంపై ఎంతటి సత్ప్రభావాన్ని చూపిందన్నదే అతని గొప్పతనాన్ని నిర్ణయిస్తుంది అనే సత్యానికి లోబడి పరిశీలిస్తే, తుంగూరి శంకర్ జీవితం అత్యంత విలువైనదిగా, సార్థకమైనదిగా నిలుస్తుంది.నేటి యువతరానికి ఆయన జీవితం ఎన్నో విలువైన పాఠాలను నేర్పుతుంది. స్వార్థపూరిత సమాజంలో సమాజం కోసం కొంత సమయం కేటాయించడం, పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, లలిత కళలను ఆదరించడం, క్రీడలకు ఊతమివ్వడం, నిర్వహించే ఉద్యోగాన్ని సేవగా భావించడం, స్నేహాన్ని జీవితాంతం పవిత్రంగా నిలబెట్టుకోవడం వంటి ఉత్తమ విలువలను ఆయన తన ఆచరణాత్మక జీవితం ద్వారా నిరూపించి చూపించారు. ధర్మపురి మహోజ్వల చరిత్రను పరిశీలిస్తే సామాజిక, సాంస్కృతిక, క్రీడా, విద్యా రంగాల్లో తనదైన ముద్ర వేసిన ప్రాతఃస్మరణీయుల జాబితాలో తుంగూరి శంకర్ పేరు అత్యంత గౌరవప్రదమైన స్థానంలో నిలుస్తుంది.తుంగూరి శంకర్ మహోన్నత వ్యక్తిత్వానికి ఆయన ఉన్నతమైన కుటుంబ నేపథ్యం అత్యంత బలమైన పునాదిగా నిలిచింది. ఆయన పూజ్య తండ్రిగారైన తుంగూరి శివరామ శర్మ గారు స్వయంకృషితో ఎదిగిన ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి. సంస్కృత భాషలో అసాధారణ పాండిత్యం సంపాదించిన ఆయన గొప్ప పౌరాణికులుగా, వైదిక విజ్ఞాన ఖనిగా కీర్తించబడ్డారు. నాటి ముంబై (బాంబే) మహానగరంలో అనేక సంవత్సరాల పాటు పౌరోహిత్యం మరియు వైదిక కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా ఆయన మరాఠీ, గుజరాతీ, హిందీ మరియు అంతర్జాతీయ భాషయైన ఆంగ్లంపై అపారమైన పట్టు సాధించారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్ 9440595494

## మొక్కలు నాటి సందేశం ఇచ్చిన ఎమ్మెల్యే



**చురకలు ప్రతినిధి నిర్మల్, జూలై, 16 :** నిర్మల్ మండలంలోని డ్యాంగాపూర్ ఎస్.ఆర్.ప్రైమ్ పాఠశాలలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు

## కోతుల దాడిలో మహిళలకు గాయాలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 16 :** కోతుల దాడిలో కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన కొలిపాక అనూష గాయపడింది. గురువారం రోజున తమ పశువుల వద్దకు వెళుతున్న సమయంలో ఒకేసారి రెండు మూడు కోతులు వెంటబడి తరిమి కొరకడంతో ఆమె గాయాల పాలయ్యింది.గాయపడ్డ కొలిపాక అనూష కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకుంది.ఆమెకు సిబ్బంది ఇంజక్షన్లు వేయడం జరిగింది.కాగా కమాన్‌పూర్ మండలంలోని పేరపల్లి,రొంపి కుంట, గుండారం రాజాపూర్ తదితర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఒకేసారి వందల సంఖ్యలో కోతులు గ్రామంలో తిరుగుతూ ఇండ్లలో చొరబడి ఇంట్లో ఇండ్లలోని వస్తువులు చిందర వందర చేస్తున్నాయి.ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని కోతులబెడద తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## నీట్ యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలు విడుదల
## -11.21 లక్షల మంది క్వాలిఫై

**చురకలు, కరీంనగర్ :** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న నీట్ యూజీ–2026 పునఃపరీక్ష ఫలితాలను నేషనల్.. . టెస్టింగ్ ఏజెన్సీ గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించింది. అభ్యర్థులు వెబ్‌సైట్‌లోని లింక్‌పై క్లిక్ చేసి, తమ వివరాలను నమోదు చేయడం ద్వారా స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం తొలుత మే 3న నీట్ (యూజీ) పరీక్ష నిర్వహించగా, ప్రశ్నపత్రం లీక్ కావడంతో జూన్ 21న దేశవ్యాప్తంగా మరోసారి రీ-ఎగ్జామ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు దాదాపు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా, అందులో 11.21 లక్షల మంది అడ్మిషన్లకు అర్హత సాధించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. 13న ఓఎంఆర్ షీట్లు విడుదల చేసి బుధవారం వరకు అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు, గురువారం ఫైనల్ కీని వెబ్‌సైట్‌లో ఉంచిన గంట వ్యవధిలోనే ఫలితాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా 66 నగరాల నుంచి 138 మంది టాప్ ర్యాంకులు సాధించినట్లు ఎన్‌టీఏ తెలిపింది. మొత్తం 720 మార్కులకు గాను 705కు పైగా మార్కులు సాధించి 17 మంది టాపర్లుగా నిలిచారు. ఈ జాబితాలో తెలంగాణ, పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. మొత్తం 720 మార్కులకు గాను 19 మంది విద్యార్థులు 700కు పైగా మార్కులు సాధించగా, వీరిలో పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హరియాణాకు చెందిన పన్నుల్ బన్సల్ సంయుక్తంగా 715 మార్కులు సాధించి అదరగొట్టారు. అలాగే 1,492 మందికి 650 కన్నా అధిక మార్కులు రాగా, 10,160 మందికి 600 మార్కులు ఆ పైన, 90,780 మందికి 500 ఆ పైన మార్కులు వచ్చాయి.

# హైటెక్ సిటీ యశోదలో 'ఇన్-హౌస్ ఎన్జీఎస్' సేవలు ప్రారంభం

**-సమగ్ర జన్యు పరీక్షల ద్వారా క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పు**
**-వేగవంతమైన రిపోర్టులతో ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ క్యాన్సర్ బాధితులకు మేలు**
**- విలేకరుల సమావేశంలో ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శిఖర్ కుమార్**




**చురకలు ప్రతినిధి,హనుమకొండ, జూలై 16 :** క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తూ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ తాజాగా 'ఇన్-హౌస్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్' సదుపాయాన్ని ప్రారంభించింది. గురువారం రోజున హనుమకొండలోని యశోద క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శిఖర్ కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం వైద్యరంగం సాంప్రదాయ విధానాల నుండి రోగి జన్యు నిర్మాణాన్ని విశ్లేషించి అందించే 'ప్రెసిషన్ ఆంకాలజీ' వైపు వేగంగా అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. ఈ క్రమం లో యశోద హాస్పిటల్స్ సొంతంగా (ఇన్-హౌస్) ఎన్జీఎస్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం క్యాన్సర్ రోగులకు ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు.

**ఇన్-హౌస్ ఎన్జీఎస్ ప్రధాన ప్రయోజనాలివే..**

ఆసుపత్రి ప్రాంగణంలోనే పరీక్షలు జరగడం వల్ల రోగి యొక్క జన్యుపరమైన మార్పులను అత్యంత వేగంగా, ఖచ్చితంగా గుర్తించవచ్చును. పరీక్షా ఫలితాల ఆధారంగా ప్రతి రోగి ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా టార్గెటెడ్ ఓరల్ థెరపీలు,ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్హిబిటర్స్ వంటి ఆధునిక చికిత్సలను డిజైన్ చేయడానికి వీలవుతుంది.ప్రధాన క్యాన్సర్లకు మేలు : ముఖ్యంగా ఊపిరితిత్తుల,రొమ్ము, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లతో పాటు ఇతర కణితుల చికిత్స నిర్ణయాలలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

**ఒకే గూటి కింద ప్రపంచ స్థాయి వైద్యం**

అత్యాధునిక సాంకేతికతను రోగులకు మరింత వేగంగా చేరవ చేయడమే తమ లక్ష్యమని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ నిపుణుల బృందం, రోబోటిక్ ఆంకోసర్జరీ, అత్యాధునిక రేడియేషన్ థెరపీ వ్యవస్థలతో పాటు ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఎన్జీఎస్ సదుపాయంతో క్యాన్సర్ రోగులకు ఒకే చోట అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమగ్ర వైద్య సేవలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో హాస్పిటల్ సిబ్బంది సాయి వెంకట్, విజయ్ కుమార్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# సారంగాపూర్‌లో పాముల సంరక్షణపై అవగాహన




**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 16 :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో "ప్రపంచ పాముల దినోత్సవం" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప అటవీ క్షేత్ర అధికారి మహమ్మద్ నజీర్ ఖాన్ హాజరై, మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పాముల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. పాములు, ఎలుకలు వంటి పంటలకు హాని చేసే జీవులను నియంత్రించడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేస్తాయని,అందువల్ల వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అంతేకాకుండా, అన్ని పాములు విషసర్పాలు కావని, కొద్ది జాతుల పాములు మాత్రమే విషపూరిత మైనవని, మిగిలినవి విషరహిత పాములేనని వివరించారు. పాములపై ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలు, సందేహాలను నివృత్తి చేస్తూ వాటిని చంపకుండా అటవీశాఖ లేదా శిక్షణ పొందిన స్నేక్ క్యాచర్లకు సమాచారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా స్నేక్ క్యాచర్ మరియు సామాజిక సేవకుడు షేర్ యాసిన్ పాల్గొని పాముల సంరక్షణలో తాను అందిస్తున్న సేవలను వివరించారు. అలాగే వివిధ రకాల పాములు, వాటి గుర్తింపు, పాములు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమం లో స్నేక్ క్యాచర్ షేర్ యాసిన్ ని వారి సేవలను గుర్తిస్తూ అటవీశాఖ ఆధ్వర్యం లో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్,వెన్నెల సుజాత, అధ్యాపకులు,విద్యార్థులు,అటవీశాఖ బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిదుగు గోవర్ధన్ గౌడ్‌ను పరామర్శించిన ప్రజాప్రతినిధులు

**-ఆకాష్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నాయకులు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 16 :** రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు చిదుకు గోవర్ధన్ గౌడ్ అల్లుడు ఆకాష్ గౌడ్ మహారాష్ట్రలోని శ్రీరాంపూర్ లో ఇటీవల హత్యకు గురి అయ్యాడు, ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య తో పాటు పలువురు ప్రజాప్రతినిదులు నాయకులు శ్రీరాంపూర్ వెళ్లి గోవర్ధన్ గౌడ్ ను ఆకాష్ గౌడ్ కుటుంబ సభ్యులను కలిసి గురువారం పరామర్శించారు. అనంతరం ఆకాష్ గౌడ్ చిత్రపటానికి పూలాలు వేసి నివాళులు అర్పించారు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహారి , సింగిల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి , ఎల్లారెడ్డిపేట తిమ్మాపూర్ బండ లింగంపల్లి గొల్లపల్లి సర్పంచ్ లు ఎలగందుల నర్సింలు, అందే సుభాష్, బాలరాజు నరస గౌడ్ , కొండ రమేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎలుసాని మోహన్ కుమార్ యాదవ్, గొల్లపల్లి నరసింహారెడ్డి , కుంబాల మల్లారెడ్డి, నెమలికొండ శ్రీనివాస్ పిల్లి కిషన్, జబ్బర్ రాజన్న సిరిసిల్ల జిల్లా జై గౌడ ఉద్యమ అధ్యక్షులు పందిర్ల లింగం గౌడ్, మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు గంట కార్తీక్ గౌడ్ ,మండల గౌడ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కోల నారాయణ గౌడ్,ఎల్లారెడ్డిపేట గౌడ సంఘం అధ్యక్షులు గంట దేవ గౌడ్ లు ఈ కార్యక్రమం లో పాల్గొని నివాలు ఆర్పించారు. అనంతరం పరమర్శించారు.

# ఫిజియోథెరపీ ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 16 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీకాంత్ ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు.ఈ విషయం తెలుసుకొని స్థానిక సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ పరామర్శించి, ఫిజియోథెరపీ ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఇక్కడ వార్డు సభ్యులు కొండ పరశురాములు,పాశం హరీష్, నాయకులు అందె చంద్రం, యువకులు పొన్నాల వెంకటేష్ రెడ్డి, అరవింద్, కొండ సాయి వున్నారు.

# సే నో టు డ్రగ్స్,సే ఎస్ టు లైఫ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన డిఎస్‌పి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జులై 16 :** రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎస్పీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణ లక్ష్యంతో నిర్వహించిన "సే నో టు డ్రగ్స్...సే యెస్ టు లైఫ్" అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ మారుపాక హరీష్,రాజన్న సిరిసిల్ల స్వేరో నెట్వర్క్ జిల్లా జనరల్ సెక్రటరీ ఆకుల మహేష్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యువజన యూత్ అధ్యక్షులు గడ్డమీది సాయిచంద్,అనిల్,దేవచంద్రం పాల్గొన్నారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని డి ఎస్ పి నాగేంద్ర చారి పిలుపునిచ్చారు.

# కెజిబివి కళాశాలలో ఇంటర్ సీఈసి కోర్సులో ఖాళీలు




**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (16) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కెజిబివి కళాశాలలో ఇంటర్ సీఈసి కోర్సులో ఖాళీ ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ లు తీసుకుంటున్నట్టు గురువారం ప్రత్యేక అధికారి రజిత తెలిపారు.కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఇంగ్లీష్ మీడియం) సిఈసి గ్రూపులో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న సీట్లను అకడమిక్ ప్రణాళికలకు వీలైనంత త్వరగా నింపడం కోసం పాఠశాలను సంప్రదించి అడ్మిషన్ పొందాలని స్పెషల్ ఆఫీసర్ రజీత సుచనచేశారు.

# టిఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యతలపై సంబరాలు

### -కవితక్క ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 16 :** రాష్ట్రంలోని గ్రామ గ్రామాన టిఆర్ఎస్ పార్టీని ఆదరిస్తున్నారు.మహిళలు అభివృద్ధి చెందాలంటే కవితక్క ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. టిఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ మజీద్ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు మజీద్ కు టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అప్పగించడంతో గురువారం రాత్రి జిల్లాలోని పలు మండలాలకు చెందిన టిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని బాబాసాహెబ్ సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి,నివాళులు అర్పించి,టిఆర్ఎస్ జెండా సమీపంలో బాణాసంచా పేల్చి, తమ నాయకుడు మజీద్‌కు పూల దండలు,శాలువాలతో సన్మానించి, మిఠాయిలు పంచి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.మజీద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 23శాసనసభ నియోజక వర్గాలలో కవితక్క బుధవారం రాత్రి టిఆర్ఎస్పార్టీ ఇన్చార్జిలను నియమించడం జరిగిందన్నారు. ఇందులో 50%బీసీలకు కేటాయించడం జరిగిందని,ఎస్సీ,ఎస్టి,అగ్ర కులాల వారికి మరో 50% కేటాయించి కవితక్క ప్రవేశపెట్టిన పాంచ జన్యం లోని సామాజిక న్యాయాన్ని అమలు చేశారన్నారు.మా పార్టీ చీఫ్ కవితక్క దృఢ సంకల్పంతో రాష్ట్రంలోని ప్రజలందరూ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఉచిత విద్య,ఉచిత వైద్యం, ఉపాధి ఉద్యోగాలు,రైతే రాజు, సామాజిక న్యాయం అనే ఐదు పథకాలతో పార్టీని ప్రకటించడం జరిగిందన్నారు. మహిళా బిల్లు కోసం కవితక్క ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంటులో మహిళల కోసం పోరాటం చేయడం జరిగిందన్నారు.ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు,తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మన ఆడబిడ్డ కవితక్క మహిళల కోసం జాగృతి సంస్థను ఏర్పాటు చేసి మన సాంస్కృతిక పండుగైన బతుకమ్మ పండుగ నిర్వహించడం జరిగిందన్నారు.మహిళా ముఖ్యమంత్రిగా కవితక్కను చూడాలని రాష్ట్రంలోని అన్ని గ్రామాల ప్రజలు, ముఖ్యంగా మహిళలు,యువత కోరుకోవడం జరుగుతుందన్నారు. తనపై నమ్మకం ఉంచి సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు టిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి తమ నాయకులు,కార్యకర్తలు ముందుకు వస్తున్నారని జిల్లాలోని ప్రజలందరూ టిఆర్ఎస్ పార్టీని ఆదరించాలని, వాటిలో చేరాలని మజీద్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల నాయకులు కదిరే భాస్కర్ గౌడ్, సయ్యద్ జావిద్, మార్వాడి దేవరాజు,రాకేష్, శ్రీహరి, భూపతి, లాల్ మహ్మద్,సతీష్ రావు,బాబు,దేవరాజు, వేములవాడ నియోజకవర్గ నాయకులు తోట కనకయ్య,నవీన్,లక్ష్మణ్, బిక్షపతి, రమేష్,మదన్ లాల్,రఘుపతి, ప్రవీణ్, లింగం,గంగారం,శైలజ,సంధ్య,రేణుక, లాస్య, పద్మలతో పాటు 150మంది సంబరాలలో పాల్గొన్నారు.

# సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

### -జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి సైబర్ వారియర్ పనిచేయాలి





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 16 :** జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో నియమించబడిన సైబర్ వారియర్స్ సమర్థవంతంగా పనిచేయాలని అదనపు ఎస్పీ చంద్రయ్య తెలిపారు.జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గారి ఆదేశాల మేరకు గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్ సమీక్ష సమావేశం నిర్వహించి అదనపు ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.....సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో నియమించబడ్డ సైబర్ వారియర్స్ సైబర్ నేరాలపై వచ్చే పిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలని,సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు డబ్బు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉన్నట్లయితే వీలైనంత త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.ప్రజలకు అందు బాటులో ఉండేలా ప్రతి పోలీస్ స్టేషన్లలో ఒక సైబర్ వారియర్స్ ని ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రజలు సైబర్ నేరానికి గురైతే ఖంగారు పడకుండా వెంటనే 1930 ట్రోల్ ఫ్రీ నంబర్ కి కానీ, NCRP potral నందు కానీ, పోలీస్ స్టేషన్లో ఉన్న సైబర్ వారియర్ ని సంప్రదించాలన్నారు.ప్రతి సైబర్ వారియర్ తన పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, పెట్టుబడి మోసాలు తదితర సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో సైబర్ ఆర్.ఎస్.ఐ జునైద్, సైబర్ వారియర్లు పాల్గొన్నారు.

# కోర్టు కేసు.. ఏ దశలో ఉందో తెలుసుకో

**చురకలు విలేకరి, జగిత్యాల జులై 16 :** కోర్టు లో దాఖలు చేసిన కేసు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు కక్షిదారులకు తాజా న్యాయ సమాచారాన్ని ఈ కోర్టు సర్వీసెస్ యాప్ ఉపయోగపడుతుందని తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్ ఇలా ప్రజల సమాచారం కోసం తెలిపారు. నేషనల్ ఇన్ ఫార్మాటెక్ సెంటర్ రూపొందించిన ఈ ఈ కోర్ట్స్ యాప్ ను సెల్ ఫోన్ లో ఇన్ స్టాల్ చేసుకోవాలి. తెరువగానే మొదటి పేజీలో సూచనలు ఉంటాయి. 16 అంకెల ఆల్ఫా న్యూమెరిక్ సీఎన్ఆర్ సంఖ్య తో కావాల్సిన సమాచారాన్ని వెతకొచ్చు. సీ ఎన్ ఆర్ సంఖ్య అందుబాటులో లేకుంటే కేసు నమోదు సంఖ్య, కక్షిదారు పేరు, న్యాయవాది పేరు తదితర వివరాలతో తెలుసు కునే అవకాశం ఉంది. కక్షిదారు తన కేసు సమగ్ర సమాచారం ను ఒక దస్త్రం రూపంలో భద్ర పరుచుకునే వెసులుబాటు ఇదే యాప్ లో మై కేస్ విభాగం లో లభ్యం అవుతుంది. కాజ్ లిస్ట్ విభాగం లో కక్షిదారు రాష్ట్రం, జిల్లా తో పాటు వివాదాన్ని పరిష్కరించే కోర్టు పరిధి, తేదీ వివరాలతో కేసు సమాచారం ను పొందవచ్చు. భువన్ సాంకేతిక సహాయం తో కక్షిదారు పరిధి కోర్టును జీ పి ఎస్ ద్వారా తెలుసుకునే వీలుంది. ఈ పే విభాగంలో చాలాన్లు చెల్లించే వీలుంది. ఎన్ జే డి జీ విభాగంలో క్రోడీ కరించిన కేసుల సమాచారం అందుబాటులో ఉంటుంది. ఈ - ఫైలింగ్, ఇండియా కోడ్, ఫామ్స్, పర్చువల్ కోర్ట్స్, ఈ కమిటీ, సుప్రీం కోర్టు లేదా హైకోర్టు తీర్పుల సమాచారం తెలుసుకోవచ్చు.న్యాయ పరమైన సమాచారం ఒక్క క్లిక్ తో అందరికీ అందుబాటులో ఉండేలా ఈ కోర్ట్స్ సర్వీసెస్ వీలు కల్పిస్తోందని న్యాయ వాది హరి అశోక్ కుమార్ వివరించారు.



# గుండెపోటుతో గీతా కార్మికుడి మృతి

### -ఎల్లారెడ్డిపేటలో విషాదం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 16 :** ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన గీత కార్మికుడు పూల్లయ్యగారి నారాయణ (65) గుండెపోటుతో గురువారం మృతి చెందారు.మృతుడు నారాయణ కు భార్య శోభ,కుమారులు శ్రీనివాస్ ,రాజేష్ కూతురు ఉమ ఉన్నారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నారాయణ మృతితో ఎల్లారెడ్డి పేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.

# టిఎస్ సిపిఎస్ఈయు జన జాగరణ యాత్ర గోడ పత్రిక ఆవిష్కరణ



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 16 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత సముదాయ భవనంలో గురువారం టిఎస్ సిపిఎస్ఈయు ఆధ్వర్యంలో జరిగే జన జాగరణ యాత్రకు మద్దతుగా జగిత్యాల జిల్లా టీఎన్జీవో, టీజీవో , నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘాల గోడ పత్రికను ఉద్యోగ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే సంకల్పంతో 33 జిల్లాల గుండా బస్సు యాత్ర ద్వారా ఉద్యోగ ఉపాధ్యాయులను చైతన్యం చేసేందుకు రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో జన జాగరణ బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాలో జూలై 25, 26 తేదీల్లో జరిగే యాత్రలో జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం జగిత్యాల జిల్లా టీఎన్జిఓ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అరుణలు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం ప్రతి ఒక్కరూ ఈ యాత్రకు సంపూర్ణ మద్దతు తెలపాలని, ఆగస్టు 23న హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వ సతీష్, సందుపట్ల రమేష్, అల్లే రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హస్టల్,పాఠశాల ఆకస్మిక తనిఖీ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (16) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, బీసీ హాస్టల్, ఎస్సీ హాస్టల్ లను గురువారం ఇబ్రహింపట్నం ఎంపీడీవో సిహెచ్ గణేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదిలో పిల్లలతో మాట్లాడుతూ నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించి ఈరోజు ఉద్యోగం లో ఉన్నానని మీరు కూడా శ్రద్ధగా చదివి ఉన్నతమైన స్థానాలలో నిలవాలన్నారు. పాఠశాల లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత పరిణామాలను పరిశీలించారు, ప్రాంగణంలోని శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు జరిగేలా చూడాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు.ఈకార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత, హాస్టల్ వార్డెన్ లు పెద్దులు,నవిన్ ,పంచాయతీ కార్యదర్శి పుల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరం

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 16 :** నాలుగు దశాబ్దాలుగా జిల్లా ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న రోటరీ క్లబ్ జగిత్యాల పట్టణ అభివృద్ధి లో కీలక భూమిక పోషిస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.గురువారం జగిత్యాల రోటరీ క్లబ్, ఆపి ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్,రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో గొల్లపల్లి రోడ్డులోని సత్య హరిశ్చంద్ర శ్మశాన వాటికలో 3బాడీ ఫ్రీజర్లను ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్,క్లబ్ సభ్యులు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి లో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ఎంతో అవసర మని,రోటరీ క్లబ్ గత 40 ఏళ్లుగా వైద్య, విద్య,సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల కు అండగా నిలుస్తోందని కొనియాడారు . శ్మశాన వాటికలో ఫ్రీజర్ల ఏర్పాటుతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగు తుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్ పర్సన్ సమిండ్లవాణి శ్రీనివాస్ , స్థానిక కౌన్సిలర్ లక్ష్మీ రాజు, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, ఏ.వి.ఎల్.ఎన్. చారి, టి.వి. సూర్యం,కొత్త ప్రతాప్,త్రివేణి సాగర్, ఎన్నాకుల అశోక్,ఆంటోనీ ముత్తు, మాజీ కౌన్సిలర్లు రాజ్ కుమార్,బోడ్ల జగదీష్, నాయకులు రామకృష్ణ రెడ్డి, ఆపి కార్యనిర్వాహక సభ్యురాలు రాధిక సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

# గంగనాల ఆయకట్టు నీటి విడుదల

**-గోదావరి వస్తేనే రెండు మండలాలకు సాగునీరు**
**- వరి పంట సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జులై (16) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో గోదావరి నది తీరంపైన ఉన్న గంగనాల ఆయకట్టు నీటిని గురువారం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో విడుదల చేశారు.ముందుగా గోదావరి అమ్మకు తెప్ప తిసి మెక్కులు చెల్లించి పుజలు నిర్వహించారు.అనంతరం గేట్ సహాయంతో గ్రామ ప్రజాప్రతినిధులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొని ఆయకట్టుకు కాలువ ధ్వార నీటిని విడుదల చేశారు. గంగనాల ఆయకట్టు క్రింద ఇబ్రహీంపట్నం మండలంలో వేములకుర్తి,యామాపూర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలం లో నడికుట, మొగిలిపేట్, ఓబులపూర్, సంగెం శ్రీరాంపూర్, దాంరాజ్ పల్లి గ్రామల ఆయకట్టుకు నీరుఅందుతోంది. దీంతో దాదాపు 5 వేల ఎకరాల కు సాగునీరు అందుతోంది .రైతులు అయకట్టు క్రింద వానకాలం, వేసవికాలలో అయకట్టు లో రైతులు పంటలు సాగు చేసుకుంటారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తరి రామనుజం, సహకారసంఘ చైర్మన్ అంకతి రాజన్న,అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడిపెల్లి మురళి,ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, అభివృద్ధి కమిటీ ఉపధ్యక్షుడు మెగిలి దెవదాస్,కోశాధికారి అన్నరపు రాజరెడ్డి, రైటర్ పెంట మహేష్ అభివృద్ధి కమిటీ సభ్యులు అంకతి రాజలింగం, కుమ్మరిపెల్లి మల్లేశం, పల్లి పెద్దులు,జిల్లా అనందం,అల్లెపు మహేష్, మాలేపు లక్ష్మణ్, సిలివేరి మహేష్, అక్కపెల్లి గంగాధర్,కనపర్తి నరేష్, పట్నం నర్సయ్య, గుడ్ల శ్రావణ్, మగ్గిడి గంగాధర్,లష్కర్ తోకల గణేష్ ,తోకల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# వాహనం ఒకరిది మెసేజ్ మరొకరికి

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 16 :** వాహనం ఒకరిది అయితే మరొకరికి మెసేజ్ వచ్చిన సంఘటన కమాన్ పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన దండే తిరుపతికి వచ్చింది.

**వివరాలకు వెళితే...**

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంతో చాలా కొట్టిన సంఘటన ఇలా ఉంది. కమాన్ పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన దండే తిరుపతి యొక్క హెచ్ ఎఫ్ డీలక్స్ నంబర్ టీ.ఎస్.- 22-8971. నంబరు గలదు. కాగా తిరుపతి యొక్క వాహనము ఆరోజు పెద్దపల్లి కి మాత్రం వెళ్లలేదు. అదే రోజు పల్సర్ వాహనం టీజీ 22-8971 నంబర్ గల వాహనాన్ని శాంతినగర్ ప్లైఓవర్ వద్ద ఫోటో తీశారు. ఆరోజు ఆ వాహనానికి పెనాల్టీ వేయాల్సి ఉండగా ట్రాఫిక్ పోలీసుల తప్పిదం వల్ల దండే తిరుపతికి మెసేజ్ వచ్చింది. వాహనం ఒకటైతే మరొక వాహన యజమానికి మెసేజ్ రావడంతో దండే తిరుపతి లబోదిబో అంటున్నాడు.









## పారిశుద్ధ్యానికి పెద్ద పీట



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 16 :** గ్రామంలో పారిశుద్ధ్యనికి పెద్దపీట వేయడం జరుగుతుంది అని గుండారం గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు అన్నారు.గురువారం గుండారం గ్రామంలోని అంబేద్కర్ నగర్లో పారిశు ధ్య పనులను పరిశీలించారు.ఇటీవల కురిసిన వర్షాలతో వివిధ వాడల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి దీంతో మొక్కలు కట్ చేసే మిషన్ ద్వారా తొలగించడం జరిగింది.మురికి కాల్వలో ఉన్న చెత్తచెదారాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు.వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కాకుండా పరిశుద్ధ పనులను వెంటవెంటనే చేయడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. అవసరమైన చోట వీధిదీపాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట ఉపసర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు దామెర దేవయ్య, గరిగంటి కృష్ణ, గ్రామ కార్యదర్శి బచ్చల ప్రసాద్, కారోబార్ రాచకొండ భీమరాజు, కాంగ్రెస్ నాయకుడు ముకుంద శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కోసం భవనాల పరిశీలన

**-అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, జూలై 16 :** రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కోసం జిల్లాలోని పలు భవనాలను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు.ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కింద అల్పాహారం, పాలు అందించే కార్యక్రమంలో భాగంగా ఆహార పదార్థాలు సిద్ధం చేసేందుకు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని పలు భవనాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ (హెచ్ కే ఎం సీ ఎఫ్) బాధ్యులు గురువారం పరిశీలించారు.పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



### ఉద్యమకారులకు

## సంక్షేమ పథకాలు

# అమలు చేయాలి



**-మంథని నాయకుల డిమాండ్**

మంథని, జూలై 16 (చురకలు ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం, ఉపాధి, వైద్యం, పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మంథని నాయకులు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న అమరుల జ్యోతి వద్ద కేకే కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమకారులతో సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల ఉద్యమకారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు కేకే, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. మంథనికి చెందిన ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిడమర్తి రవి ఆదేశాల మేరకు కమిటీ ముందు హాజరై పలు సూచనలు చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు 25 వేల రూపాయల పెన్షన్, 1000 కోట్ల రూపాయలతో ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు, ఉచిత వైద్యం, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య వంటి సంక్షేమ పథకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు శాశ్వత సామాజిక భద్రత కల్పించాలని, ఈ ప్రక్రియలో కాలయాపన చేయకుండా సత్వర న్యాయం చేయాలని కమిటీ ముందు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమకారుల సంఘుశీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కావటి సతీష్, మంథని ఉద్యమకారులు మిరాల రామిరెడ్డి, సాదుల శ్రీను, గుడిసె గట్టయ్య, ఎస్ కే ముజీబ్, కోరవేన కుమార్, కాసిపేట మల్లేష్, కట్టేకోళ్ల విజయ్, కాసు ధర్మరాజ్, జావీద్ ఖాన్, పెండెం రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# రైతులు ఆరు తడి పంటలు మాత్రమే వేసుకోవాలి

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 16. :** రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ రైతులను కోరారు. ఈ మేరకు ఆయన గుండారం గ్రామంలోని రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్ర స్తుతం ఎల్నినో ప్రభావంతో వర్షపాత నమోదు తగ్గడం జరిగింది. అదేవిధంగా గమనించినట్లయితే గత సంవత్సరంతో పోల్చుకుంటే ప్రస్తుత సంవత్సరం ఈనెల భూగర్భ జలాలు సుమారుగా ఒకటిన్నర నుండి రెండు మీటర్ల వరకు తగ్గిపోవడం జరిగింది అని పేర్కొన్నారు, దీని ప్రభా వం బోర్లు బావులు ద్వారా వ్యవసాయం చేసే వరి పంటపై



తీవ్రమైన ప్రభావం చూపుతుంది అన్నారు. ప్రాజెక్టులు చెరు వులు కుంటలు నిండకపోవడం ద్వారా కాలువల ద్వారా నీరు అందే అవకాశాలు తగ్గిపోతాయి. అదేవిధంగా జలవిద్యుత్ శక్తి ద్వారా ఉత్పత్తి అయ్యే పవర్ సప్లై తగ్గే అవకాశం కలదు అని స్పష్టం చేశారు. కావున రైతు సోదరులు పై విషయాలను గమనించి నీటి అవసరాలు తక్కువగా ఉండే అటువంటి ఆరుతడి పంటలను పండించాలి, అదేవిధంగా ఉద్యానవన పంటలైనటువంటి కూరగా యలు ఆయిల్ ఫామ్ పంటలను ప్రత్యామ్నాయ పంటలుగా సాగు చేసుకోవాలి అని తెలిపారు. ఎల్నినొ ప్రభావంతో పంటల సాగుపై ఎలాంటి ప్రభావం పడుతుంది, వరికి బదులుగా నీటి అవసరం తక్కువగా ఉండే అపరాలు, ఇతర ఆరు తడి పంటలు, ఆయిల్ పామ్ పంటను సాగు చేసుకోవాల్సిందిగా గ్రామాల వారిగా మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు డి శ్వేత, వి నవీన్ లు నాగారం, గొల్లపల్లి, గుండారం గ్రామాలలో అవగా హన కల్పించడం జరిగినది, ఇట్టి కార్యక్ర మంలో గౌరవ సర్పంచులు జంగిలి పోచాలు, పొనగంటి కుమార్, శీలారపు మల్లయ్య, గ్రామ ఉపసర్పంచులు అం బిరి రాజేందర్, వార్డు సభ్యులు మరియు రైతులు పాల్గొన్నారు.

# మంత్రి సహకారంతో కమాన్ పూర్‌ను అభివృద్ధి చేస్తా

**చురకలు ప్రతినిధి, కమాన్ పూర్ :** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి సహాయ సహకారాలతో కమాన్ పూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా అని సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అన్నారు. కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల సుభాష్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ గురువారం ప్రారంభించారు. కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్‌లో ఈజీఎస్ (ఉపాధి హామీ) నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ రంగు



సత్యనారాయణ గౌడ్ గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సుభాష్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్, వార్డు సభ్యులు గుంజపడుగు నవీన్, కమ్మగోని మౌనిక, మల్లారపు మానస--అరుణ్ కుమార్, మేడగోని సత్యమ్మ--శ్రీనివాస్, బోగే లక్ష్మి--రమేష్, మెరుగు కుమార్, గోడిశెల లింగస్వామి, నాయకులు నగునూరి నర్సయ్య, రంగు శ్రీనివాస్, బొజ్జ రాజసాగర్, బొజ్జ చారి, గర్రెపెల్లి వెంకన్న, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**-కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**-ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా భూముల సర్వే**
**-రైతులు రీ-సర్వే సమయంలో అందుబాటులో ఉంటూ పూర్తి సహకారం అందించాలి**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి), జూలై-16 :** భూ భారతి కింద చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ పంచాయతీ కార్యాలయంలో



నిర్వహించిన గ్రామ సభ లో భూభారతి -- రీ-సర్వే అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా ఇప్పటికే అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, ఇతర భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రీ-సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర రీ-సర్వే నిర్వహించాలని ఆదేశించిందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 190 రెవెన్యూ గ్రామాలు ఉండగా, మొదటి దశలో 70 గ్రామాలను రీ-సర్వే కోసం ఎంపిక చేసినట్లు, అందులో సబ్బితం గ్రామం కూడా ఒకటని పేర్కొన్నారు. రీ-సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అనంతరం ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో నిర్వహిస్తామని వెల్లడించారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి ప్రజలకు 21 రోజుల గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వే ద్వారా 99 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. గ్రామాల్లో రీ-సర్వే జరుగుతున్న సమయంలో ప్రజలు అందుబాటులో ఉంటూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. రోజుకు సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తామని, ఏ భూములను సర్వే చేయనున్నారనే సమాచారాన్ని ముందుగానే అందిస్తామని, సంబంధిత రైతులు నిర్దేశిత సమయంలో తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. రీ-సర్వే ద్వారా రూపొందించే భూ వివరాలు రాబోయే 60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉపయోగపడేలా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. తహసిల్దార్ రాజయ్య, సర్పంచ్ నూనె సరోజన, సర్వేయర్ లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

### మంత్రి "అడ్లూరి"తో

# కాంగ్రెస్ నేత ప్రణవ్ భేటీ

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 16:** హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ భవన్ కు, దళిత బంధు గ్రౌండింగ్ కు నిధులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను కోరారు. హైదరాబాద్ సెక్రటేరియట్ లో ప్రణవ్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. గత ప్రభుత్వంలో ప్రొసీడింగ్ ఇచ్చి అసంపూర్తిగా నిర్మించిన అంబేద్కర్ భవన్ కు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని కోరారు. దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు దళిత బంధు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ప్రణవ్ తెలిపారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు చర్చించినట్టు



తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని సంక్షేమ పాఠశాలల్లో, అసత్య గృహాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కూడా కోరినట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా సర్ కార్యక్రమంలో పార్టీ నేతల భాగస్వామ్యంతో పాటు, నియోజకవర్గానికి సంబంధించిన తాజా రాజకీయ పరిస్థితులను కూడా ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలుస్తోంది.